



EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com


4PM

www.suryaa.com

సోమవారం

01 జులై 2024

పేజీలు: 02

ఉదయం 6.30 కి పెనుమాక గ్రామంలో పెన్షన్ లబ్ధిదారుడు ఇంట్లో టీ తాగుతున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు

| వృద్ధాప్య.వితంతు, ఒంటరి మహిళల పింఛన్ రూ.3 వేల నుండి రూ.4000లకు పెంపు | ట్రాన్స్‌జెండర్లు, గీత కార్మికులు, మత్స్యకారులకు పింఛన్ రూ.4000లకు పెంపు | పూర్తి వైకల్యంతో బాధపడే దివ్యాంగులకు రూ.5వేల నుంచి రూ.15,000లకు పెంపు | తీవ్ర అనారోగ్యం, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడేవారికి రూ.5 వేల నుంచి రూ.10,000లకు పెంపు | దివ్యాంగుల పింఛన్ రూ.3వేల నుంచి రూ.6,000లకు పెంపు |
|---|---|---|---|---|





## ఏపీ సీఎం సరికొత్త రికార్డ్..

# పెన్షన్ పంపిణీ చేసిన చంద్రబాబు

## పెనుమాక గ్రామంలో ఏపీ ముఖ్యమంత్రి

### పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో చంద్రబాబు

### లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సీఎం అందజేశారు

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో భాగంగా.. గుంటూరు జిల్లా పెనుమాకలోని ఎస్టీ కాలనీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 6 గంటలకు కాలనీలో స్వయంగా ఆయనే లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. బాణావత్ పాములు నాయక్ కుటుంబం చంద్రబాబు చేతుల మీదుగా పింఛన్ తీసుకుంది. పాములు నాయక్‌కు వృద్ధాప్య పింఛన్, ఆయన కుమార్తె ఇస్లావత్ శివకుమారికి వితంతు పింఛన్, ఆయన భార్యకు రాజధానిలో భూమిలేనివారికి అందజేస్తున్న పింఛన్‌ను స్వయంగా చంద్రబాబు అందజేశారు. దేశంలోనే తొలిసారి ఓ ముఖ్యమంత్రి స్వయంగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ అందజేశారు.. ఇది ఓ రికార్డ్ అని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్ల పంపిణీ అనంతరం గ్రామంలోని మసీదు సెంటర్ వద్ద నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్థులు, లబ్ధిదారులతో మాట్లాడారు.రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పేరుతో పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిపెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ నెల నుంచి పెంచిన పింఛన్‌లు అందజేస్తున్నారు.. మొత్తం రూ.7,000 పింఛను మొత్తాన్ని అర్హులకు అందిస్తున్నారు.ఇప్పటి వరకు పింఛన్ రూ. 3,000 చొప్పున అందుతుండగా.. కూటమి ప్రభుత్వం తాజాగా ఆ మొత్తానికి ఒకేసారి రూ. 1,000 పెంచి రూ. 4,000 చేశారు. ఈ పెంచిన పింఛన్‌ను ఏప్రిల్ నుంచే అమలు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టిన హామీ మేరకు.. ఏప్రిల్, మే, జూన్ నెలలకు రూ. 1,000 చొప్పున కలిపి.. మొత్తం రూ. 7,000 నేడు పంపిణీ చేస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 65.18 లక్షల మందికి పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం రూ.4,408 కోట్లు విడుదల చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల పంపిణీని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.. పింఛన్‌లను తొలి రోజే 100 శాతం పంపిణీ పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకు న్నారు. ఒకవేళ ఏదైనా కారణంగా తొలి రోజు పింఛను అందుకోలేని వారికి రెండోరోజు వారి ఇళ్ల దగ్గరే గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది అందిస్తారు. అంతేకాదు దేశంలోనే తొలిసారి వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు పింఛన్ అందిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఇప్పటి వరకు హర్యానా ప్రభుత్వం మాత్రమే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు రూ.3వేల పింఛన్ అందిస్తోంది. 2024 జూన్ వరకు ఆంధ్రప్రదేశ్‌లోనూ రూ.3వేల పెన్షన్ అందించగా.. పెంచిన పింఛన్లతో అధిక మొత్తంలో పంపిణీ చేస్తున్న రాష్ట్రంగా కూడా ఆంధ్రప్రదేశ్ నిలిచింది.

## ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమం: సీఎం చంద్రబాబు

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. వారి జీవన ప్రమాణాల పెంపునకు మొదటి అడుగు పడిందని చెప్పారు. మంగళగిరి నియోజకవర్గం పెనుమాకలో పింఛన్ల పంపిణీని ప్రారంభించిన అనంతరం మసీదు సెంటర్‌లో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో గ్రామస్థులు, లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. కొత్త ప్రభుత్వంలో మొదటగా పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టామని తెలిపారు. "మీ అందరి ఆశీస్సులతో నాలుగోసారి సీఎంగా ప్రమాణం చేశా. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమం. వారి జీవన ప్రమాణాల పెంపులో మొదటి అడుగు పడింది. సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు అని ఎన్టీఆర్ చెప్పారు. ఆయన స్ఫూర్తితో మా ప్రభుత్వం పనిచేస్తుంది. పేదలపై శ్రద్ధ పెడతాం.. అనునిత్యం వినూత్నంగా ఆలోచిస్తాం. ఆర్థిక అసమానతలు లేని సమాజం చూడాలన్నదే నా ఆలోచన. దివ్యాంగులకు పింఛను రూ.6వేలు చేశాం. వారికి చేయూతనివ్వడం సమాజం బాధ్యత. పంపిణీ చేతకాకపోతే ఇంటికి వెళ్లాలని వారికి ఆనాడే చెప్పా. నేడు 1.25లక్షల మంది సచివాలయ సిబ్బందితో పంపిణీ జరుగుతోంది. దీనికి వాలంటీర్ల సహాయం కూడా తీసుకోవాలని చెప్పాం. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకే రోజు ఐదు సంతకాలు పెట్టా. మొదటిది మెగా డీఎస్సీ.. వీలైనంత త్వరగా టీచర్ల నియామకం చేపట్టే బాధ్యత తీసుకుంటా. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం చేశా. అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై మూడోది పెట్టా. రూ.5 కే భోజనం చేయొచ్చు. త్వరలోనే 183 క్యాంటీన్లను ప్రారంభిస్తాం. యువతకు ఉద్యోగాల కల్పన కోసం నైపుణ్య శిక్షణ ఇస్తాం. ప్రభుత్వానికి శక్తి వస్తే ప్రజలకు మరింత తిరిగి ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. మాది ప్రజా ప్రభుత్వం.. నిరంతరం మీకోసం పనిచేస్తాం. ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించి ప్రభుత్వానికి సహకరించాలి.

## మంగళగిరి రుణం తీర్చుకుంటాం

తప్పుతున్న కొద్దీ గత ప్రభుత్వ తప్పులు, అప్పులే కనబడుతున్నాయి. గతంలో ప్రజల బతుకులను రివర్స్ చేశారు.. కోలుకుని మళ్లీ ముందుకు వెళ్లాలి. అందరం సమష్టిగా కలిసి పనిచేద్దాం. సంపద సృష్టించి ఆదాయం పెంచుతాం.. పెంచిన దాన్ని పంచుతాం. మీ అందరి అభిమానం చూరగొని లోకేశ్ ఇక్కడి నుంచి పోటీ చేశారు. మంగళగిరిలో 90 వేలకు పైగా మెజారిటీతో ఆయన్ను గెలిపించారు. ఈ నియోజకవర్గం రుణం తీర్చుకుంటాం. వైసీపీ నేతలు ఐదేళ్ల పాటు ప్రజలను అణగదొక్కారు. పెట్టుబడులు పెట్టేందుకు భయపడే పరిస్థితి కల్పించారు" అని చంద్రబాబు అన్నారు. మంగళగిరి నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను మంత్రి నారా లోకేశ్ ప్రస్తావించారు.





## ప్రజల కోసం పనిచేస్తా.. జీతాలు వద్దని చెప్పా

పిఠాపురం ప్రజలకు కృతజ్ఞతలు ఎలా చెప్పాలా అని అనుకున్నాను. ఈ విధంగా చెప్పినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. తాను తీసుకున్న శాఖలు చాలా కీలకమైనవని.. వాటిని అర్థం చేసుకోడానికి సమయం పట్టిందన్నారు. తక్కువ చెప్పి ఎక్కువ పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా చెప్పారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన తరువాత డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కళ్యాణ్ తాను పోటీ చేసిన పిఠాపురం నియోజకవర్గానికి తొలిసారి వచ్చారు. జూలై 1 సందర్భంగా వృద్దులకు, వితంతువులకు, వికలాంగులకు పెన్షన్ పంపిణీ చేసేందుకు పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు గ్రామానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్దిదారులకు స్వయంగా తన చేతుల మీదుగా పెన్షన్ డబ్బులు రూ. 7 అందజేశారు. అనంతరం అక్కడి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు.అత్యంత వెనుకబడ్డ వాళ్ళు ఉన్నారంటే దివ్యంగులేనని గతంలో సీఎం చంద్రబాబు కూడా చెప్పారన్నారు. అందుకే వారికి ఈ ప్రభుత్వం పెన్షన్ పెంచిందని చెప్పారు. పంచాయితీ రాజ్ లెక్కలు చూస్తుంటే.. ఎటు వెళ్లాయో అర్థం కావట్లేదని గతపాలకులకు చురకలు అంటించారు. రూ.600 కోట్లు ఖర్చు చేసి రుషికొండలో భవనాలు కట్టారని.. అదే డబ్బుతో ఎంతో అభివృద్ధి జరిగి ఉండేదని అన్నారు. ఇప్పుడు ఆ నిధులన్నీ బుడిదలో పోసిన పన్నీరు అయిందని విమర్శించారు. తన కార్యాలయంలోకి ఫర్నీచర్ ఇస్తాను అని అధికారులు చెబితే వద్దూ నేనే కొనుకుంటానని చెప్పానన్నారు. తన వైపు నుండి అవినీతి అనేది ఉండదని మాట ఇస్తున్నానన్నారు. పంచాయతీరాజ్ శాఖలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి ఉండాలని ఆదేశించారు. కేంద్రంలో నిధులు



ఉన్నా ఎందుకు అడగలేదో అర్థం కాలేదన్నారు. చేపల చెరువులు ఉన్న చోట నీళ్లు లేవు, గోదావరి చుట్టూ ఉన్నా తాగడానికి నీళ్లు ఉండడం లేదని అన్నారు. ఇది గతపాలకుల పరిపాలనా లోపం అని ఎత్తి చూపారు. స్కిల్ డెవలప్మెంట్ జరగాలి.. ఏ యువతలో ఏ టేలెంట్ ఉందో ఎవరికీ తెలీయదు.. వాటిని వెలికి తీసేందుకు కృషి చేస్తామన్నారు.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## ఐపీఎల్ 2025లో ఆర్‌సీబీకి బ్యాటింగ్ కోచ్,
# మెంటార్‌గా డీకే

ఐపీఎల్ ఆర్‌సీబీ జట్టులో ప్రతిసారీ దాదాపు మంచి ఆటగాళ్లు ఉంటారు. కానీ ఈ జట్టు ఒక్కసారి కూడా ఐపీఎల్ టైటిల్‌ను గెలవలేకపోయింది. ఇటివల ఐపీఎల్ 2024 ఎలిమినేటర్‌కు చేరుకున్న ఈ జట్టు ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఆర్‌సీబీ ఐపీఎల్ 2025కి ముందు ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు దినేష్ కార్తీక్‌క కీలక బాధ్యతలను అప్పగించింది. దీంతో ఐపీఎల్ 2025కి ఆర్‌సీబీ తరపున దినేష్ కార్తీక్ బ్యాటింగ్ కోచ్, మెంటార్‌గా నియమించబడ్డారు. దీనికి సంబంధించిన పోస్ట్‌ను ఆర్‌సీబీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. కార్తీక్ గత సీజన్ ఐపీఎల్ నుంచి రిటైర్ అయ్యాడు. అతని కెరీర్ ఇప్పటివరకు అద్భుతంగా ఉందని చెప్పవచ్చు. అయితే ఇప్పుడు కార్తీక్ కొత్తగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఐపీఎల్‌లో ఆర్‌సీబీతో పాటు ఇతర జట్లకు కార్తీక్ ఆడాడు. అంతర్జాతీయ క్రికెట్‌లోనూ అతనికి అద్భుతమైన రికార్డు ఉంది.

## నీట్ అంశంపై చర్చకు స్పీకర్ నిరాకరణ..
# లోక్‌సభ నుంచి విపక్షాలు వాకౌట్



లోక్‌సభ సమావేశాలు ఐదో రోజు వాడీవేడిగా కొనసాగుతున్నాయి. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే టీమ్ ఇండియాకు ఎంపీలంతా అభినందనలు తెలిపారు. అనంతరం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ప్రారంభించారు. అయితే, నీట్ అంశంపై చర్చ చేపట్టాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. అందుకు స్పీకర్ ఓం బిర్లా ఒప్పుకోకపోవడంతో సభ నుంచి ప్రతిపక్ష ఎంపీలు వాకౌట్ చేశారు. సభ ప్రారంభం కాగానే లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ సభలో నీట్ అవకతవకల అంశాన్ని ప్రస్తావించారు. ఈ అంశంపై చర్చ జరపాలని పట్టుబట్టారు. ఈ విషయంపై తాము వాయిదా తీర్మానం కూడా ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సభలో రాహుల్ మాట్లాడుతూ.. 'మేము నీట్‌పై ఒక రోజు మొత్తం చర్చను కోరుతున్నాము. ఇది చాలా ముఖ్యమైన అంశం. రెండు కోట్ల మందికిపైగా విద్యార్థులు ప్రభావితులయ్యారు. 70 సందర్భాల్లో పేపర్‌లీక్‌లు జరిగాయి. ఈ విషయంలో విద్యార్థులంతా ఆందోళనలో ఉన్నారు. వారికి పార్లమెంట్ నుంచి భరోసా కల్పిస్తూ సందేశాన్ని ఇవ్వాల్సి ఉంది. మీరు ఈ అంశంపై ప్రత్యేక చర్చకు అనుమతిస్తే మేం సంతోషిస్తాం' అని రాహుల్ గాంధీ అన్నారు. అయితే రాహుల్ అభ్యర్థనను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వ్యతిరేకించారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే సమయంలో వాయిదా తీర్మానాలు తీసుకునేందుకు నిబంధనలు అంగీకరించవని వెల్లడించారు. ప్రస్తుత సమావేశాల్లో జీరో అవర్, ప్రశ్నోత్తరాలు లేవని తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చిద్దామని పేర్కొన్నారు. తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత ఇతర అంశాలను లేవనెత్తవచ్చని విపక్షాల అభ్యర్థనను ఓంబిర్లా తిరస్కరించారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని సభ ముగించే వరకూ ప్రత్యేక చర్చ జరగదని చెప్పారు. దీంతో సభ నుంచి విపక్షాలు వాకౌట్ చేశారు.

## వేములవాడ రాజన్న ఆలయ
# ఈవోగా వినోద్ రెడ్డి



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ రాజన్న ఆలయ ఇన్‌చార్జి ఈవోగా కె.వినోద్ కుమార్‌ను నియమిస్తూ ఎండోమెంట్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ గణేశ్ టెంపుల్ ఈవోగా పని చేస్తుండగా రాజన్న ఆలయ బాధ్యతలు అడిషనల్‌గా నిర్వర్తించనున్నారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న ఇన్‌చార్జి ఈవో రామకృష్ణ హైదరాబాద్ కు వెళ్లనున్నారు.

## మరోసారి తగ్గిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర



ధరల మోతతో ఇబ్బంది పడుతున్న గ్యాస్ వినియోగదారులకు దేశీయ చమురు సంస్థలు ఉపశమనం కలిగించాయి. వాణిజ్య అవసరాల కు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ ధరను తగ్గించాయి. 19 కేజీల సిలిండర్‌పై రూ.30 మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. తగ్గిన ధరలు ముంబై, కోల్‌కతా, చెన్నై సహా దేశవ్యాప్తంగా నేటి నుంచి అంటే జులై 1వ తేదీ నుంచే అమల్లోకి వస్తాయని వెల్లడించాయి.చమురు సంస్థల నిర్ణయంతో దేశ రాజధాని ఢిల్లీలో రూ. 1,676 గా ఉన్న వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ. 1,646కి తగ్గింది. అదేవిధంగా ముంబైలో రూ.1,629 నుంచి రూ.1,598కి తగ్గింది. ఇక చెన్నైలో రూ.1,840గా ఉన్న ధర ఇప్పుడు రూ.1,809కి పడిపోయింది. అదేవిధంగా కోల్‌క తాలో రూ.1,787 ఉన్న కమర్షియల్ సిలిండర్ ధర రూ.1,756కి తగ్గింది. స్థానిక పన్నుల ఆధారంగా రాష్ట్రాలను బట్టి ధరల్లో మార్పులు ఉంటాయి. కాగా, వరుసగా గత రెండు నెలల నుంచి కమర్షియల్ సిలిండర్ ధరలు తగ్గుతూ వస్తున్న విషయం తెలిసిందే. జూన్ 1న ఎల్పీజీ రేటు దాదాపు రూ.69 తగ్గగా, మే 1న సిలిండర్‌పై రూ.19 తగ్గింది.

## నేటి నుంచి వింబుల్డన్

ప్రతిష్ఠాత్మక టెన్నిస్ టోర్నమెంట్ వింబుల్డన్ నేటి నుంచి ప్రారంభం కానుంది. ఈ సారి ఫేవరెట్‌గా సెర్బియా ప్లేయర్ జకోవిచ్ ఉన్నారు. ఆయనకు టాప్ సీడ్ సినర్, మూడో ర్యాంకర్ అల్కరాస్ నుంచి పోటీ నెలకొంది. మరోవైపు గాయం కారణంగా నాదల్ ఈ టోర్నీ నుంచి తప్పుకున్నారు. మహిళల సింగిల్స్‌లో స్వైటెక్, సబలెంక, సకారి టైటిల్ రేసులో ఉన్నారు. భారత్ ప్లేయర్ సుమిత్ తొలి రౌండ్‌లో సెర్బియా ఆటగాడు కెక్‌మనోవిచ్‌తో తలపడనున్నారు.



## టర్కీలో భారీ పేలుడు
# ఐదుగురు మృతి
### 60 మందికిపైగా..గాయాలు

టర్కీలో సంభవించిన భారీ పేలుడుకు ఐదుగురు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలో మరో 63 మంది గాయపడ్డారు. బాధితులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. గాయపడినవారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. మీడియాకు అందిన సమాచారం ప్రకారం ఈ ఘటన టర్కీకి పశ్చిమాన ఉన్న ఇజ్మీర్‌లో చోటుచేసుకుంది. ఈ ప్రాంతంలోని ఒక రెస్టారెంట్‌కు సంబంధించిన టాంకులో పేలుడు సంభవించింది. అక్కడి సీసీటీవీ కెమెరాలో ఘటన అంతా రికార్డయ్యింది. ఒక్కసారిగా భారీగా పేలుడు శబ్ధం వినిపించడంతో స్థానికులంతా వణికిపోయారు. ఆ రహదారి గుండా వెళుతున్నవారు ప్రమాదం బారినపడ్డారు. టర్కీ హోమ్‌శాఖ మంత్రి అలీ ఎర్లికాయ్ సోషల్ మీడియాలో స్పందిస్తూ తాము ఘటన జరిగిన స్థలానికి రెస్క్యూ బృందాన్ని పంపినట్లు తెలిపారు. బాధితులు చికిత్స పొందుతున్న ఆస్పత్రికి ఇజ్మీర్ గవర్నర్ వెళ్లి వారిని పరామర్శించారు. ఈ ఘటనలో స్వల్పంగా గాయపడిన 40 మందికి చికిత్స అందించిన అనంతరం డిశ్చార్జ్ చేశారు. మిగిలిన బాధితులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కాగా ఈ పేలుడుకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు అనుమానంతో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.



## కేసీఆర్ పిటిషన్‌ను
# కొట్టేసిన హైకోర్టు

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు షాక్ తగిలింది. విద్యుత్ కమిషన్ ఏర్పాటును రద్దు చేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. విద్యుత్ కమిషన్ ఏకపక్షంగా వ్యవహరిస్తోందంటూ కేసీఆర్ పిటిషన్‌లో పేర్కొనగా.. నిబంధనల మేరకే విద్యుత్ కమిషన్ వ్యవహరిస్తోందని ఏజీ తెలిపారు. కేసీఆర్ పిటిషన్‌కు విచారణార్హత లేదని వాదించారు. ఇరువర్గాల వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం.. ఏజీ వాదనలతో ఏకీభవించింది. కేసీఆర్ పిటిషన్ కొట్టేస్తూ.. విద్యుత్ కమిషన్ విచారణ కొనసాగించవచ్చని తెలిపింది.

## దేశ వ్యాప్తంగా క్రిమినల్ చట్టాల్లో
# కీలక మార్పులు..
### దేశంలో అమల్లోకి కొత్త న్యాయచట్టాలు




బ్రిటిష్ కాలం నాటి చట్టాలకు ముగింపు పలుకుతూ వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నేర న్యాయ చట్టాలు దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్(సీఆర్‌పీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్) చట్టాలను తీసుకువచ్చారు. ఈ క్రమంలో కొత్త చట్టాల కింద తొలి కేసు నమోదయింది. అదికూడా దేశ రాజధానిలోనే కావడం గమనార్హం. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ సమీపంలో ఓ చిరు వ్యాపారిపై గత అర్ధరాత్రి ఎఫ్ఐఆర్ నమోదయింది. పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా.. ఆ వ్యాపారి రోడ్డు మీద గుట్కా, వాటర్ బాటిల్స్ అమ్ముతూ వారికి కనిపించాడు. దీంతో దుకాణం రోడ్డుగా అడ్డంగా ఉన్నదని, దానిని తీసేయాలని ఆ వ్యాపారికి చెప్పారు. ఎన్నిసార్లు చెప్పినప్పటికీ అతను వినకపోవడంతో భారతీయ న్యాయ సంహిత క్రిమినల్ కోడ్‌లోని సెక్షన్ 285 ప్రకారం.. కమలా మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో అతనిపై కేసు నమోదుచేసినట్లు పోలీఉలు తెలిపారు. నిందితుడిని బీహార్‌లోని పాట్నాకు చెందిన పంకజ్ కుమార్‌గా గుర్తించారు. ఈ సెక్షన్ ప్రకారం.. రోడ్లను ఆక్రమించడం, తద్వారా ప్రమాదాలకు కారణం కావడం లాంటి చర్యలు నేరంగా పరిగణించి జరిమానా విధిస్తారు. జరిమానా రూ.5 వేల వరకు ఉంటుంది.

### కొత్త చట్టాల్లోని కీలక నిబంధనలు ఇవే..

- మైనర్‌పై సామూహిక లైంగిక దాడికి పాల్పడితే మరణ శిక్ష లేదా జీవిత ఖైదు నిబంధన. పిల్లలను అమ్మడం లేదా కొనడం క్రూరమైన నేరం.
- జీరో ఎఫ్ఐఆర్ విధానంతో ఒక వ్యక్తి పోలీసుస్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఏ స్టేషన్‌లో అయినా ఫిర్యాదు చేయవచ్చు. దీని ద్వారా ఏదైనా ఘటనను రిపోర్టు చేయడంలో లేదా చట్టపరమైన చర్యలు ప్రారంభించడంలో ఆలస్యాన్ని నివారించొచ్చు.
- ఏదైనా ఘటనను ఒక వ్యక్తి ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు వీలుంది. పోలీసుస్టేషన్‌కు వ్యక్తిగతంగా వెళ్లాల్సిన అవసరం లేదు. దీని ద్వారా వేగవంతమైన ఫిర్యాదు ద్వారా అదే వేగంతో పోలీసులు తగిన చర్యలు తీసుకొనే వెసులుబాటు ఉంటుంది.
- ఎలక్ట్రానిక్ రూపంలో సమన్లు జారీ చేయవచ్చు. దీని ద్వారా చట్టపరమైన ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు పేపర్ వర్క్‌ను తగ్గిస్తుంది.
- లైంగిక దాడి బాధితురాలి స్టేట్‌మెంట్‌ను ఆమె సంరక్షకురాలు లేదా బంధువు సమక్షంలోనే ఒక మహిళా పోలీసు అధికారి రికార్డు చేయాలి. వారం రోజుల్లోగా వైద్య నివేదిక రావాలి.
- మహిళలపై కొన్ని నేరాలకు సంబంధించి.. బాధితురాలి వాంగ్మూలాన్ని మహిళా మేజిస్ట్రేట్ ముందు నమోదు చేయాల్సి ఉంటుంది. వారు లేనిపక్షంలో మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచాలి.
- ఏదైనా కేసులో నిందితులు, బాధితులు 14 రోజుల్లోగా ఎఫ్ఐఆర్, పోలీసు రిపోర్టు, చార్జిషీట్, స్టేట్‌మెంట్లు, ఇతర డాక్యుమెంట్ల కాపీలను పొందవచ్చు.
- క్రిమినల్ కేసుల్లో విచారణ పూర్తయిన తర్వాత 45 రోజుల్లోగా తీర్పు ఇవ్వాలి. విచారణ ప్రారంభమైన 60 రోజుల్లోగా అభియోగాలు నమోదు చేయాలి.
- కేసు విచారణలో అనవసర జాప్యాలను నివారించేందుకు, సకాలంలో న్యాయం అందించేందుకు న్యాయస్థానాలు కూడా గరిష్ఠంగా రెండు వాయిదాలు మాత్రమే మంజూరు చేస్తాయి.
- సాక్షుల భద్రతను, వారి సమాచారాన్ని దృష్టిలో ఉంచుకొని సాక్షుల రక్షణ పథకాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా అమలు చేయాలి.
- రాజద్రోహం స్థానంలో దేశద్రోహం అనే పదాన్ని చేర్చారు. వ్యవస్థీకృత నేరాలు, ఉగ్రవాద చర్యలను నిర్వచించారు. ఏదైనా కేసులో చేపట్టే తనిఖీలు, స్వాధీనాలను వీడియో రికార్డింగ్ చేయడం తప్పనిసరి.
- వివాహం పేరుతో మోసం చేయడం, మైనర్లపై సామూహిక లైంగిక దాడికి పాల్పడటం, మూక హత్యలు, చైన్ దొంగతనాలు వంటి ఘటనలకు పరిష్కరించేందుకు ప్రత్యేక నిబంధనలు.
- మరింత భద్రత కల్పించడం, దర్యాప్తులో పారదర్శకతను అమలు చేయడంలో భాగంగా లైంగిక దాడి కేసుల్లో బాధితురాలి స్టేట్‌మెంట్‌ను ఆడియో, వీడియో ద్వారా పోలీసులు నమోదు చేయాలి.



## పురుగుల మందు తాగి
## ఎస్ఐ ఆత్మహత్యాయత్నం

శ్రీరాములు అలియాస్ శ్రీను అని పిలువబడే ఎస్ఐ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. మహబూబాబాద్ రైతుల వ్యవసాయ భూమి సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ,108కు ఫోన్ చేశాడు. వెంటనే సంప్రదించిన 108 సిబ్బంది పరిస్తితి విషమంగా ఉండడంతో ఎసైని దగ్గరలోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఒక ఎసై హోదలో వుండి కూడా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఎందుకు పాల్పడ్డాడు? ఉద్యోగ ఒత్తిడులా? లేక కుంటుంబ కలహాల ? కారణలు ఇంక విషయం తెలియలస్సివుంది.



## మట్టిమిద్దె కూలి
## ఒకే కుటుంబంలో నలుగురి మృతి

మట్టిమిద్ కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడిన ఘటన జిల్లాలోని వనపట్లలో చోటు చేసుకుంది. వర్షం కారణంగా తడిచిన మట్టి ఇంటి మిద్దె, గోడ ఒక్కసారిగా కూలిపోయాయి. నిద్రిస్తున్న ఆ కుటుంబం మీద పడ్డాయి. ఘటనలో గొడుగు పద్మ (26), ఆమె ఇద్దరు కూతుర్లు పప్పి(6) , వసంత (6) , కొడుకు (10) నెలలు విక్కీ కన్నుమూశారు. తండ్రి భాస్కర్(28)కు గాయాలు కావడంతో చికిత్స కోసం జిల్లాస్పత్రికి తరలించారు. ముగ్గురు బిడ్డలతో తల్లి ఊహించిన ప్రమాదంలో చనిపోవడంతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.